## మౌలిక వసతుల కల్పన కృషి



భూగర్భ డ్రైనేజీ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్

**ఉప్పల్ జూన్ 15 :** నాచారం డివిజన్‌లోని సాయినగర్ కాలనీలో చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను ఆదివారం నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజన్‌శేకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో మౌలిక వసతుల కల్పన కృషి చేస్తున్నామని చెప్పారు. రోడ్లు, నీటి, డ్రైనేజీ సమస్యలు లేకుండా చూస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సాయి జన్ శేకర్, కట్ట బుచ్చన్న గౌడ్, యాకి, కాలనీవాసులు రావుఫ్, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

## కరాటే విద్యార్థులకు బెల్టులు ప్రదానం



కరాటే విద్యార్థులకు సర్టిఫికెట్లు,బెల్టులు అందజేసిన కార్పొరేటర్ శ్రీవాణి.

**రామంతాపూర్, జూన్ 15:** రామంతాపూర్‌లో జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో శిక్షణ పొందిన 16 మంది కరాటే విద్యార్థులకు బెల్టులు , సర్టిఫికెట్లను కార్పొరేటర్ బండారు శ్రీవాణి ఆదివారం ప్రదానం చేశారు. కరాటేలోవిద్యార్థులకు శిక్షణ ఇచ్చిన జీహెచ్‌ఎంసీ కోచ్ రామ్‌కుమార్‌ను కార్పొరేటర్ అభినందించారు.ఈ కార్యక్రమంలో రైతు జూన్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీరామ్ రెడ్డి పాల్గొన్నారు.

## క్రీడా పాఠశాలలో అడ్మిషన్ల ఎంపికకు పోటీలు

**చర్లపల్లి, జూన్ 15 :** క్రీడా పాఠశాలలో 4వ తరగతి ప్రవేశానికి ఈనెల 18న కుషాయిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపికకు పోటీలను నిర్వహిస్తున్నామని కాప్రా మండలం ఎంఈఓ బాపురెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కుషాయిగూడ స్కూల్‌లో ఆయన మాట్లాడుతూ మండలం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు అవకాశాని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 17వ తేదీలోపు కార్యనిర్వాహక కార్యదర్శి ప్రభాకర్ వద్ద తమ పేర్లను నమోదు చేసుకొవాలని, విద్యార్థులు కుల ధ్రువీకరణ, ఆధార్‌కార్డ్, ఐదు ఫోటోలు, 3వ తరగతి ఉత్తీర్ణత ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని ఆయన కోరారు.

# కాలనీల సమగ్రాభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే 'బండారి'



చర్లపల్లి డివిజన్‌లో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న శివసాయినగర్ కాలనీవాసులు

**చర్లపల్లి, జూన్ 15:** నియోజకవర్గ పరిధిలోని కాలనీల సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని శివసాయినగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆదివారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో చేపట్టిన భూగర్భడ్రైనేజీ పనులు పూర్తయిన వెంటనే ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా వాసవిశివనగర్‌లో సుమారు రూ.6 కోట్ల నిధులతో చేపట్టిన బాక్స్‌డ్రైయిన్ పనులు పుర్తయిన వెంటనే రోడ్ల నిర్మాణ పనులు చేపడుతామని ఆయన పేర్కొన్నారు. డివిజన్‌లో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్‌గౌడ్, సీసీఎస్ అధ్యక్షుడు పద్మారెడ్డి, కాలనీవాసులు ఉన్నారు.

### సీనియర్ సిటిజన్ల సమస్యల పరిష్కారానికి కృషి

**ఉప్పల్:** సీనియర్ సిటిజన్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ సమావేశం నాచారంలోని హెచ్ ఎంటీనగర్ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారి,ఎమ్మెల్సీ కోదండ రామ్ ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీనియర్ సిటిజన్ లకు సమాజంలో తగిన గౌరవం, గుర్తింపు తీసుకువచ్చేలా ప్రతి ఒక్కరు తోడ్పాటు అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు నరహింహ, మాజీ మేయర్ వెంకట్ రెడ్డి, ఎల్లారెడ్డి, నాయకులు సాయిజెన్‌శేఖర్, సాయిబాబా, ప్రేమ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



18నెలల క్రితం మారుతినగర్ రోడ్డును తవ్వి కంకర వేసి వదిలేసిన దృశ్యం

# రోడ్డును తవ్వి 18నెలలు

**బోడుప్పల్, జూన్ 15:** బోడుప్పల్ నగరపాలక సంస్థ పరిధిలో నిధులలేమితో అభివృద్ధి పనులు ఎక్కడికి అక్కడ నిలిచిపోయాయి. దీంతో కాలనీవాసులు మౌలిక వసతులు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగర పరిధిలోని శివపురి కాలనీ రోడ్డు.1, మారుతీనగర్ రోడ్డు. 4ను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడానికి రోడ్డు తవ్వి కంకరపరిచారు. పనులు మొదలుపెట్టి 18 నెలలు గడుస్తున్నా రోడ్డు పనులు మాత్రం ముందుకు సాగడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆస్తిపన్ను వసూల్లో ముందుండే మున్సిపల్ అధికారులు అభివృద్ధి పనులు చేపట్టడంలో మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు ధ్వజమెత్తారు. పలుమార్లు మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రాలు ఇచ్చిన స్పందన లేదని అన్నారు.ఏడాదిన్నర కాలంగా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు ధర్నా చేపడతామని కాలనీవాసులు హెచ్చరించారు.

## వెలగని వీధిదీపాలు

### పట్టించుకోని అధికారులు

**పోచారం,జూన్15:** పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలోని లక్ష్మీనర్సింహకాలనీలో వారం రోజులుగా వీధి దీపాలు వెలుగడం లేదు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉన్న హైమాస్టు లైట్లు వారం రోజులుగా వెలగడం లేదు. దీంతో పరిసరాలు చిమ్మ చీకట్లు కమ్ముకొన్నాయి.మున్సిపాలిటీ అధికారులు స్పందించి వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



అన్నోజిగూడ లక్ష్మీనర్సింహకాలనీలో వెలగని హైమాస్టు లైట్లు.

# ఘనంగా ఉర్సు ఉత్సవాలు



ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ మంత్రి మల్లారెడ్డి

**శామీర్‌పేట, జూన్ 15 :** మండల కేంద్రంలోని హజరత్ సయ్యద్ జలాల్ ఉద్దీన్ ముల్తాని రెహ దర్గా ఉర్సు ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి దర్గాను దర్శించుకొని, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయనకు ముస్లిం మత పెద్దలు, బీఆర్‌ఎస్ నాయకులు స్వాగతం పలికి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు మోహన్ రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ ఐలయ్య యాదవ్, డైరెక్టర్ భూమి రెడ్డి, అలియాబాద్ మాజీ సర్పంచ్ కుమార్ యాదవ్, నాయకులు ముజిబుద్దీన్, బీఆర్‌ఎస్ నాయకులు హరి మోహన్ రెడ్డి, చాంద్ పాషా, వంగ వెంకట్ రెడ్డి , మాజీ వార్డు సభ్యులుపాల్గొన్నారు.

## ఆషాఢ బోనాలను వైభవంగా నిర్వహిస్తాం



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

**మల్కాజిగిరి,జూన్15:** ఆషాఢ మాస బోనాలను వైభవంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం బోయిన్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆలయాలకు ఆషాఢ మాస బోనాలకు ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు మంజూరు చేయించాలని కోరుతూ ఎమ్మెల్యేకు పలు ఆలయాల కమిటీ సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు కలకుండా ఆలయ కమిటీలు ఏర్పాటు చేయాలని అన్నారు.

ఆలయాలకు ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్ర మంలో మధుసూదన్ రెడ్డి, జెకె సాయి గౌడ్, శంకర్, శ్రీనివాస్, సురేష్, రమ, ఆలయాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంట్లో చోరీ..బంగారం అపహరణ

**పీర్జాదిగూడ జూన్ 15:** ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు,వెండి వస్తువులు దొంగిలించిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది పోలీసుల కథనం ప్రకారం... బోడుప్పల్ పరిధి రాజలింగం కాలనీకి చెందిన భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 13న నగరంలో ఉంటున్న తన బంధువుల ఇంట్లో జరిగిన కార్యక్రమానికి వెళ్లారు. తిరిగి మరుసటి రోజు ఉదయం వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి.దీంతో ఇంట్లోకి వెళ్లి చూసేసరికి బీరువాలో ఉన్న 5జతల బంగారు ఉంగరాలు 2ఉంగరాలు, 10తులాల వెండి వస్తువులు, కొంత నగదు కనిపించకపోవడంతో చోరీకి గురయ్యాయని తెలుసుకున్న బాధితులు ఆదివారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## రజకులకు ఉచిత విద్యుత్ హామీ ఏమైంది?



ధర్నా గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న రజకసంఘం నాయకులు

### ప్రభుత్వంపై ధ్వజమెత్తిన రజక నాయకులు.. ధర్నాకు పిలుపు

**బోడుప్పల్, జూన్ 15:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా రజకులకు ప్రకటించిన ఉచిత విద్యుత్ హామీ నెరవేరడం లేదని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రజక వృత్తిదారుల సంఘం గౌరవాధ్యక్షులు అంబే చక్రపాణి ఆరోపించారు. ఈ మేరకు చెంగిచెర్ల రజక సంఘం అధ్యక్షుడు అంబె శ్రీనివాస్‌తో కలిసి ఆదివారం ఈనెల 17న ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ధర్నా గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో రజకులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. ఇందిరాపార్కు వద్ద చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా అంబే చక్రపాణి మాట్లాడుతూ ఉచిత విద్యుత్ పథకాన్ని LT 2 నుంచి LT 4గా మార్చాలని, ఉచిత విద్యుత్ పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. విద్యుత్ అధికారుల వేధింపులు ఆపాలని, రాజీవ్ యువ వికాసం పథకానికి రజక యువతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రజకులకు ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో అంబె కృష్ణ, నరసింహ, యాదయ్య, మల్లేష్, చందర్, రమేష్, నవీన్ కుమార్, మహేష్, రాజు, రమేష్, లక్ష్మి, పద్మ, స్నేహ, నాగరాణి, గోకుల్, కవిత, నాగమణి, పల్లవి, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

## కీసరగుట్టలో గుప్త నిధుల తవ్వకాలు



కీసరగుట్టలో గుప్త నిధుల కోసం పెద్ద గుంత తీసిన దృశ్యం
గుప్త నిధుల కోసం కుండ, ఎర్ర బట్టతో పూజలు చేసిన దుండగులు

**కీసర, జూన్ 15:** కీసరగుట్టలోగుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు ఆధారాలు లభించాయి. ఈ విషయంపై కొంతమంది స్థానికులు ఉన్నతాధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసిన్నట్లు తెలిసింది. కీసరగుట్ట భవానీ రామలింగేశ్వరస్వామి ఆలయం వెనుకభాగంలోని లింగాలకుంటలో గుర్తుతెలియని దుండగులు వ్యక్తులు శనివారం రాత్రి గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు ఆనవాళ్లు కన్పించాయి. స్వామివారి ఆలయానికి కొద్ది దూరంలో ఉన్న లింగానికి పూజలు చేసి గుప్త నిధుల కోసం కొన్ని అడుగుల మేర తవ్వి ఆ స్థలంలో పూజలు చేసి తవ్వకాలు జరిపారు. ఘటనా స్థలంలో ఓ మట్టికుండ, ఎర్రని గుడ్డ, పసుపు, నీళ్ల బాటిల్ కన్పించడటం పలు అనుమానాలకు తావిస్తుంది. ఈ విషయంపై ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

### బాలికపై బాలుడు లైంగికదాడి

**జగద్గిరిగుట్ట, జూన్ 15:** బాలికపై , బాలుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట పీఎస్ పరిధిలోని బస్తీలో రెండు కుటుంబాల వారు సమీపంలో నివాసముంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం బాలిక (5)పై అదే ప్రాంతానికి చెందిన బాలుడు (14) లైంగిక దాడికి పాల్పడ్డాడు.

బాలిక ఏడుస్తూ ఉండడంతో ఆరాతీయగా విషయం తెలిసింది. బాధితురాలి తల్లి దండ్రుల ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేశారు.

## సెమీకండక్టర్ రంగంలో విప్లవాత్మక మార్పులు



సంస్కృతి కళాశాలలో జరిగిన ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో పాల్గొన్న అధ్యాపకులు.



మాట్లాడుతున్న గురునానక్ యూనివర్సిటీ డీన్ డాక్టర్ వికాస్

**ఘట్ కేసర్, జూన్ 15:** భవిష్యత్తు సాంకేతికతలన్నీ సెమీకండక్టర్లపైనే ఆధారపడి ఉంటాయని గురునానక్ యూనివర్సిటీ ఆర్ అండ్ డీ డీన్‌డాక్టర్ వికాస్ మహేశ్వరి అన్నారు.ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సెమీకండక్టర్ టెక్నాలజీ అడ్వాన్సింగ్ ఫ్రం ఫండమెంటల్స్ టూ ఫ్యూచర్ ఇన్నోవేషన్స్ అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఆదివారం ప్రారంభమైంది. నేటి విద్యార్థులు బేసిక్ కాన్సెప్ట్‌లను బలంగా నేర్చుకుని నూతన ఆవిష్కరణల దిశగా ప్రయాణించాలన్నారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో మిళితమైన సాంకేతికతలు సెమీకండక్టర్ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నట్లు చెప్పారు.యువ ఇంజినీర్లు భారత్‌ను టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంస్కృతి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్ ఏ.వి. రమణారెడ్డి, డైరెక్టర్ ఎం రామకాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ జానకిరాములు, డీన్ అకడమిక్ ప్రొఫెసర్ శివకేశవ రెడ్డి, కన్వీనర్లు శశిధర్, వంశీకృష్ణ, కో-కన్వీనర్ వినయ్ కుమార్,అధికారులు పాల్గొన్నారు.

# విద్యతోనే మెరుగైన జీవితం





డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ వ్యవస్థాపకురాలు అరుణతో కలిసి అవగాహన కల్పిస్తున్న హెచ్‌సీయూ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు

**మాదాపూర్, జూన్ 15 :** విద్యతోనే మెరుగైన జీవితం సాధ్యమవుతుందని, ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటి సాధనకు కృషి చేయాలని హెచ్‌సీయూ ప్రొఫెసర్ దార్ల వెంకటేశ్వరరావు అన్నారు. మియాపూర్ గోకుల్‌ప్లాట్‌లోని డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు విచ్చేసి సొసైటీ వ్యవస్థాపకురాలు చావా అరుణతో కలిసి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత విద్యావంతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, ప్రభుత్వం వసతులు, సౌకర్యాలు కల్పిస్తుందని, మధ్యాహ్న భోజనం, యూనిఫాం, పుస్తకాలు అందిస్తుందని తెలిపారు. పేదలు, వలస కార్మికులు అవకాశాలపై అవగాహన లేకుండా అజ్ఞానంలో జీవితం గడుపుతున్నారని చెప్పారు. విద్య వల్ల కలిగే లాభాలు వారికి తెలియకపోవడం బాధాకరమైన విషయమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వారి పిల్లలను బడికి పంపాలని, విద్యతోనే మెరుగైన జీవితం ఉంటుందని తెలిపారు. విద్యపై తల్లిదండ్రులు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని, తమకు దగ్గరలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని కోరారు. మంచి సమాజ నిర్మాణం కావాలనే ఆశయంతో స్లమ్ ఏరియాకు వచ్చి విద్యపై అవగాహన చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ సభ్యులు, జేఎన్టీయూ విద్యార్థులు, వైద్యులు, వలంటీర్లు పాల్గొన్నారు.

## రక్తదానం చేయడానికి ముందుకు రావాలి



**శేరిలింగంపల్లి, జూన్ 15:** గచ్చిబౌలిలోని కాంటినెంటల్ హాస్పిటల్స్ 2025 రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇన్ – హౌస్ బ్లడ్ డొనేషన్ డ్రైవ్ నిర్వహించింది. మూడు రోజులుగా 100 మంది రక్తదానం చేశారు. ఆదివారం కాంటినెంటల్ హాస్పిటల్స్ వ్యవస్థాపకుడు, చైర్మన్ డాక్టర్ గురు ఎన్. రెడ్డి మాట్లాడుతూ.. యూనిట్ రక్తం మూడు ప్రాణాలను కాపాడుతుందని, అత్యవసర పరిస్థితుల్లో విలువైన ప్రాణాలను కాపాడటానికి రక్తదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. శిబిరంలో ప్రముఖ రక్తదాతలలో కలిసి TGIIC జోనల్ మేనేజర్ కవిత ముత్యాల ఆసుపత్రిలో రక్తదానం చేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు.

## ధర్నాను జయప్రదం చేయండి

**దుండిగల్ :** ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా 17న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చెయ్యాలని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. షాపూర్‌నగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం వామపక్ష పార్టీల నాయకులు గోడపత్రికను ఆవిష్కరించారు. సీపీఐ జాతీయ సమితి సభ్యుడు యూసఫ్, జిల్లా కార్యదర్శి ఉమామహేశ్, సీపీఎం మండల కార్యదర్శి లక్ష్మణ్, సీపీఐ ఎంఎల్ నాయకులు అనురాధ, శివబాబు, మాస్‌లైన్ కార్యదర్శి ప్రవీ ణ్, సీపీఎం నాయకులు అంజయ్య, సత్యం, స్వాతి పాల్గొన్నారు. రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కును కాలరాస్తున్నారని, చర్చలు జరుపడానికి సిద్ధమని ప్రకటించినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఖనిజాలు, అడవులను కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేసేందుకే ఆపరేషన్ కాగార్ అన్నారు. దాన్ని ఆపేందుకు కేం ద్రంపై ఒత్తిడి తీసుకురావడానికి ధర్నాను జయప్రదం చెయ్యాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నర్సింహారెడ్డి, వంశీ, జంబూ, లక్ష్మి, సీపీఎం నాయకులు శ్రీను, కరుణాకర్, ఎండీ బాషా పాల్గొన్నారు.


## ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

**ఉప్పల్,జూన్15:** ఉప్పల్ శిల్పారామంలో వారాంతపు సాం స్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం కెనడా కూచిపూడి కళాకారిణి రేణి శ్రీజిత్ తన ప్రదర్శనలో పుష్పాంజలి, శివ స్తుతి, పదం, అన్నమాచార్య కీర్తన, నిరుపమా సుందరాకార అంశాలను ప్రదర్శించి మెప్పించారు. నృత్య కిన్నెర వ్యవస్థాపకులు, సంగీతనాటక అకాడమీ అవార్డీ మద్దాలి ఉష గాయత్రీ శిష్య బృందం నీరజ , లక్ష్మి శ్రీ, వైష్ణవి, వినీత, ఉజ్వల, సిరి చందాన, దీపిక లు తమ ప్రదర్శన చేపట్టారు. శరణం భావ, బలకనకమయ, శ్రీనగరళహరి, నారాయణతే, బ్రోచేవారు, ఒకపరికొకపరి, చందాన చర్చిత, తిల్లాన, తరంగం అంశాలను ప్రదర్శించారు.

## ఆలయానికి విరాళం

**మల్కాజిగిరి,జూన్ 15:** ఈస్ట్ ఆనంద్‌బాగ్‌లోని నల్ల పోచమ్మ ఆలయానికి ఆదివారం రూ. 25వేల విరాళాన్ని మాజీ కార్పొరేటర్ మురుగేష్ అందజేశారు.కార్యక్రమంలో కృష్ణ కుమ్మరి, సంజు, గోపాల్, నవీన్, మాధవి, చంద్రమణి, సరిత, పుష్ప రాణి, చంద్రకళ పార్టీ నాయకులు రాజు,వెంకటేష్, శ్రీకాంత్ యాద వ్, చందు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా సన్ రైజ్ చారిటబుల్ ట్రస్టు



చంద్రమౌళి వారికి చెక్కు అందజేస్తున్న అధ్యక్షుడు సుందర్ రావు, కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు

**ఘట్‌కేసర్,జూన్ 15:** ఆర్థికంగా పేదవారై ఇబ్బందుల్లో ఉంటే తమ ట్రస్టు ఆదుకుని అండగా ఉంటుందని సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు వై.సుందర్ రావు, ప్రధాన కార్యదర్శి మోపర్తి శ్రీకాంత్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్ఎఫ్‌సీనగర్‌లోని సన్‌రైజ్ ట్రస్ట్ కార్యాలయంలో నగరంలోని బాలాజీనగర్‌కు చెందిన మేదోజీ చంద్రమౌళి చారి కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి షుగర్ వ్యాధి ఎక్కువ కావడంతో కాలు తీసివేసినందున ఏ పని చేసుకోలేని స్థితిలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఆర్థికంగా పేదవాడు కావడంతో ట్రస్టును ఆశ్రయించగా ఆదివారం అతనికి రూ.20వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు శరభందా, బంగారు బాబు, దేవానంద్ గౌడ్, వీరారెడ్డి, కృష్ణ, రామయ్య, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## బీటెక్ విద్యార్థి అదృశ్యం



రాహుల్ (ఫైల్ )

**ఘట్ కేసర్, జూన్ 15:** బీటెక్ విద్యార్థి అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్ స్పెక్టర్ పరశురాం కథనం ప్రకారం...ఘట్‌కేసర్‌లోని వివేకానంద జూనియర్ కళాశాల సమీపంలో నివాసముంటున్న ఇస్లావత్ రాహుల్(21) మున్సిపాలిటీ పరిధి అంకుషాపూర్‌లోని ఏసీఈ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ 3వ సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల14న తన రూమ్ నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతని తండ్రి మల్లేష్ అతని కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో ఆదివారం ఘట్‌కేసర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు.తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నాట్లు పోలీసులు తెలిపారు. విద్యార్థి సమాచారం తెలిసినవారు సాయికుమార్ ఎస్సై 87125 80183, ఘట్ కేసర్ పోలీస్ స్టేషన్ 87126 62705కు సమాచారం ఇవ్వాలని కోరారు.